క్లుప్తంగా

ప్రజల మద్దతుతో పోరాటాలు



జోలె పట్టిన సీపీఎం నాయకులు

శ్రీకాళహస్తి : ప్రజల నైతిక మద్దతుతో ప్రజాక్షేత్రంలో అలుపెరగని పోరాటాలు చేస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అంగేరి పుల్లయ్య పేర్కొన్నారు. మే 8న తిరుపతిలో ప్రారంభం కానున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాల విజయవంతం కోసం గురువారం పట్టణంలో ఆర్థిక విరాళాల సేకరణ చేపట్టారు. ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య, వెంకటేష్, గురునాథం, రాధమ్మ, సుబ్రమణ్యం, ప్రసాద్, ప్రవళిక, రాజా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం



కుంభాభిషేక పూజల్లో ఎమ్మెల్యే

సత్యవేడు : ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల ప్రాంగణంలో నిర్మించిన సిద్ధి వినాయక ఆలయ కుంభాభిషేక పూజలు గురువారం వైభవంగా జరిగాయి. ఆలయం నిర్మించి 14 ఏళ్లు పూర్తి కావడంతో కొత్తగా గోపురం నిర్మాణం చేపట్టారు. స్వామి వారికి వెండి తొడుగులు, కలశ నిర్మాణం చేపట్టారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, వైద్యశాల కమిటీ సభ్యులతో కలిసి కుంభాభిషేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వీకేఎస్ బాషా, శోభ, హేమ భూషణం, దినేష్‌కుమార్, రుత్వికులు గణేష్ శర్మ, సుధాకర్‌శర్మ, సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ బాలసుందరం రెడ్డి, డాక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి



సుబ్రమణ్యం (ఫైల్)

నారాయణవనం : వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సొరకాయలు సోదరుడు, పార్టీ నాయకుడు సుబ్రమణ్యం గురువారం (60) సాయంత్రం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న సుబ్రమణ్యం తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఊంజల్‌సేవలో అమ్మవారు



అలంకరణలో పద్మావతీ అమ్మవారు

నారాయణవనం : టీటీడీ అనుబంధ పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పంగుణోత్తర ఉత్సవాలలో ఆరోరోజు గురువారం సాయంత్రం అమ్మవారు ఊంజల్ సేవలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. ఆలయ అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు ఊంజల్ మండపంలో ఊయలపై కొలువుదీరారు.

నేడు ఏకాంతసేవ

శుక్రవారం ఉదయం కల్యాణ వెంకన్నకు, అమ్మవారికి శుక్రవార అభిషేకాలను నిర్వహిస్తారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత కల్యాణ వెంకన్న, పద్మావతీ అమ్మవార్ల అంతర ప్రాకార ఊరేగింపును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాత్రి 10 గంటలకు అమ్మవారి సన్నిధిలో శయన సేవ, శనివారం ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రామాలయంలో..

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట మండలం అడుసుపాలెంలోని శ్రీరామాలయంలో గురువారం రాత్రి సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కుర్రకాలువ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రాణమ్మ, ఎంపీటీసీ భాస్కర్, వేణు, మణికంఠ, రాజేష్, గురువారెడ్డి, గోపి, నాగరాజు, గురవయ్య, కిరణ్, ధనంజయులు, శోభనాద్రి, కంజాక్షుడు ఉభయ దారులుగా వ్యవహరించారు.

ప్రమాదకరంగా గొయ్యి



పైపు లీకేజీలతో గుంతలో నిలిచిన నీరు

నాగలాపురం : స్థానిక బజారు వీధిలో తిరుమల మిల్క్ డెయిరీ ఎదురుగా గుంత ఏర్పడింది. ఈ గుంతలో ద్విచక్రవాహన దారులు పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అంతే కాకుండా రోడ్డు కింద పైపు లీకేజీలు ఉన్నందున నిత్యం గుంతలో నీరు నిలుస్తోంది. దీంతో బస్సులు, కార్లు వేగంగా గుంతల మీద వెళ్లినప్పుడు రోడ్డు పక్కన నడిచి వెళ్తున్న వారి మీద బురద పడుతోంది. ఈ రోడ్డు మీదుగా అటు తహసీల్దారు కార్యాలయానికి ఇటు పంచాయతీ కార్యాలయానికి మండల అధికారులు దాటి వెళ్తున్నా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి ఈ గుంతను పూడ్చి వేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పండని తమలపాకు

అందరి నోరు పండించే తమలపాకు రైతుకు మూడు పూటలా తినలేని దుస్థితి నెలకొంది. ఆ తోటలను సాగు చేసే కర్షకులకు కష్టాలు, కన్నీళ్లే మిగులుతున్నాయి. గతంలో చెరువు ఊటనీటితో తమలపాకు సాగుకు కావాల్సినంత నీటిని రైతులు వినియోగించేవారు. గంగ కాలువ తవ్వకంతో చెరువు కోల్పోవడంతో తమలపాకు తోటలకు నీటి కష్టాలు పెరిగాయి. ఫలితంగా అన్నదాతలకు సాగు భారంగా మారింది. – సత్యవేడు



- సాగునీటి కొరతతో అవస్థలు
- అన్నదాతకు భారంగా తోటల సాగు
- పంటకు పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్

తమలపాకు తోటల సాగుకు నీటి వసతి లేక బావుల నీటి ఆధారంగా సాగు చేస్తుండడంతో వ్యవసాయ ఖర్చు మోయలేని భారం అయింది. 25 ఏళ్ల క్రితం సత్యవేడులో తమలపాకు తోటలు ఈశ్వరాలయానికి వెళ్లే దారికి ఇరువైపులా పచ్చదనం పరుచుకొని 50కి పైగా తోటలు ఉండేవి. తమలపాకుల తోటల పెంపకంతో రైతులు, కూలీలకు జీవనాధారంగా ఉండేవి. చెరువు నీరు, ఊట నీరు పుష్కలంగా ఉండడంతో కావాల్సినంత నీటిని రైతులు వాడుకునేవారు.



తమలపాకులు కట్టలు కడుతున్న రైతులు

నీటి వసతి కోల్పోయిన రైతాంగం

సత్యవేడు రైతాంగానికి ఆధారంగా ఉన్న చెరువు తెలుగు గంగ కాలువ తవ్వకంతో సాగు నీటికి ఆధారంగా ఉన్న చెరువును రైతులు కోల్పోయారు. అప్పటి నుంచి రైతులు నీటికి అవస్థలు తప్పడం లేదు. సత్యవేడు, దళవాయి అగ్రహారం చెరువు ఆయకట్టు కింద సుమారు 500 ఎకరాలు పైగా సాగు భూమి ఉంది. నీటి వసతి లేక రైతులు వర్షాధారంగా పంటలు పండించే స్థితి నెలకొంది.

పెట్టుబడులు అధికం..

నీటి వసతి సమృద్ధిగా ఉన్నప్పుడు రోజు మార్చి రోజు తోటకు నీరు పెడుతుంటే పంట నాణ్యత ఉండేది. ఆకులు గిరాకీ ఉంటూ వ్యవసాయం తక్కువ ఖర్చుతో లాభాల పంట పండడంతో నాలుగు రూపాయలు కళ్లజూసేవారు. చెన్నై, నెల్లూరు, కంచి ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి ఆర్డర్లు ఇచ్చి కొనేవారు. ప్రస్తుతం వ్యవసాయం ఖర్చు అధికం కావడంతో రైతులు తమలపాకు తోటల పెంపకంపై మొగ్గు చూపడంలేదు. ఎకరా పంట పండించేందుకు రూ. 30 వేలకు పైగా ఖర్చు అవుతుండడంతో రైతులు ఆసక్తి చూపడం లేదు. నీటి వసతి లేక ఆకులు నాణ్యత తగ్గడంతో రైతులు తక్కువ ధరలకే అమ్ముకోవాల్సి వస్తోంది. తోటల పెంపకానికి ప్రభుత్వం రుణాలు ఇవ్వకపోవడంతో వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోతున్న రైతులకు ప్రభుత్వ పరిహారం అందకపోవడంతో పడిపోయిన తీగలు ఎత్తి కట్టేందుకు కావాల్సిన వెదురు కర్రలు కొనేందుకు రైతులు కొత్త అప్పులు చేయాల్సి వస్తోందంటున్నారు. తమలపాకు పండించే రైతులకు బ్యాంకులు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

సాగు భారంగా ఉంది..

తమలపాకు సాగులో నాకు బాగా అనుభవం ఉంది. డీజిల్ ధర పెరిగింది. కరెంటు సక్రమంగా అందడంలేదు. బావుల నీరే ఆధారంగా మారింది. ఎరువుల పేడ, కూలీలు ఎక్కువ అవసరం ఉంది. పెట్టుబడి కూడా రావడంలేదు. పంట మార్చాలన్నా రూ.25 వేలకు పైగా ఖర్చు అవుతోంది. ఇలాగైతే తమలపాకు పంట సాగు చేయలేం. ప్రస్తుతం నీటి సమస్యపై చర్యలు తీసుకోవాలి.
–ఎస్.ఉష, సత్యవేడు

అందని తుపానుల సాయం



ఏటా తుపాను దెబ్బకు తమలపాకు తోటలు పడిపోతున్నాయి. ప్రభుత్వం నుంచి సాయం అందకపోవడంతో 12 మంది రైతులు నష్టపోయాం. మళ్లీ తోట పెంచాలంటే 25 నుంచి 50 వేలకు పైగా ఖర్చు అవుతోంది. ప్రభుత్వం నుంచి పరిహారం రావడం లేదు. అప్పుపైన మళ్లీ అప్పులు చేస్తున్నాం. తమలపాకు రైతులకు పెట్టుబడి సాయం అందించాలి.
– గోపి, దళితవాడ, సత్యవేడు.

నేడు వెలవెల

సత్యవేడులో 2000 సంవత్సరానికి మునుపు 100 కుటుంబాలకు పైగా తమలపాకు తోటలు సాగు చేస్తుండేవారు. అప్పట్లో నీటి వసతి సమృద్ధిగా ఉండేది. తెలుగు గంగ కాలువ ఏర్పాటుతో చెరువు నీటి వసతి కోల్పోయారు. కాలువ లోతుగా ఉండి పొలాలు ఎత్తుగా ఉండడంతో రైతులకు బావుల నీటిపై ఆధార పడాల్సి వచ్చింది. వ్యవసాయం ఖర్చు మోయలేక, భారంగా మారడంతో చేసిన అప్పులు తీర్చలేని రైతులు మూడు పూటలా పట్టెడన్నం తినలేని పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. దీంతో రైతులు ఇతర పనుల వైపు వెళ్లడంతో నేడు 12 కుటుంబాలు మాత్రమే తమలపాకు తోటలు సాగు చేస్తున్నారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి దూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆర్‌పీఎఫ్ సీఐ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట ఆర్‌పీఎఫ్ నూతన సీఐగా ఎస్.వెంకటేశ్వర్లు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న సీఐ సందీప్ కుమార్ తిరుపతికి బదిలీపై వెళ్లడంతో కడప జిల్లా ఎర్రగుంట్ల నుంచి రేణిగుంటకు వెంకటేశ్వర్లు బదిలీపై వచ్చారు.

ప్రదోష పూజలు

నాగలాపురం : మండలంలోని సురుటుపల్లిలోని శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుక్కల్ ఆలయంలోని నందీశ్వర స్వామి, శ్రీ వాల్మీకీశ్వర స్వామికి ఏక కాలంలో పూజలు చేశారు. ఆలయ కార్య నిర్వహణాధికారి పి.లత, ఆలయ సిబ్బంది పరందామరెడ్డి, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : పోషణ పక్వాడలో భాగంగా రేణిగుంట మండలంలోని కరకంబాడి ఇందిరా నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సూపర్‌వైజర్ హేమావతి ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఏర్పేడులో..

రేణిగుంట ప్రాజెక్ట్, ఏర్పేడు మండలంలోని వికృతమాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీఓ కృష్ణ మంజరి, సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుమతి, లావణ్య, గౌరీ, తేజ, రామేశ్వరి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు రక్ష



తల్లిపాల ప్రాముఖ్యం వివరిస్తున్న రాగసుధ

నారాయణవనం : చంటి పిల్లలకు తల్లిపాలు పోషకాలతో పాటు రోగ నిరోధక శక్తిని పెంచి రక్షగా ఉంటాయని పీహెచ్‌సీ డాక్టర్ రాగసుధ పేర్కొన్నారు. గురువారం నారాయణవనం బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషణ్ పక్వాడా అవగాహన కార్యక్రమంలో తల్లిపాల ప్రాముఖ్యం, సంరక్షణ, పోషకాహార లోపంపై తల్లులు, బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వాలు అందించే పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ, హెల్త్ ఎడ్యుకేటర్ రామకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

టిప్పర్ బోల్తా

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కాటూరు సమీపంలోని కేటీ రోడ్డు మలుపు వద్ద అదుపు తప్పి రాళ్ల లోడ్‌తో వెళుతున్న టిప్పర్ బోల్తా పడింది. తంగెళ్లపాళెం నుంచి తడకు రాళ్లను తీసుకెళుతున్న టిప్పర్ కాటూరు వద్ద అదుపు తప్పడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ ఎలాంటి గాయాలు లేకుండా బయట పడ్డారు.



నేడు రాములోరి కల్యాణోత్సవం



బుచ్చినాయుడుకండ్రిగ : విద్యుత్ దీపాలంకరణలో ఆలయం



ఏర్పేడు (రేణిగుంట) : అలంకరణలో శ్రీసీతారాములు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని పల్లమాల శ్రీరామ కల్యాణ క్షేత్రంలో శుక్రవారం శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా సీతారామ కల్యాణం ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెలికం సుబ్రమణ్యం రెడ్డి తెలిపారు. శ్రీ రామ క్షేత్రంలో సాయంత్రం 6 గంటలకు సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తులకు అన్నదానం ఉంటాయని, భక్తులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



కమనీయం.. కల్యాణోత్సవం

ఏర్పేడు (రేణిగుంట) : ఏర్పేడు మండలంలోని మర్రిమందలో గురువారం శ్రీ సీతారాముల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేద పండితుల వేద మంత్రాల మధ్య శుభ ముహూర్తాన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణ మహోత్సవాన్ని కనులారా తిలకించి తరించారు. రాత్రి పుర వీధుల్లో స్వామి, అమ్మవారిని ఊరేగించారు.

ఎక్కడి చెత్త అక్కడే..!





రెండో రోజు సమ్మెలో పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులు, వంటావార్పుతో నిరసన తెలుపుతున్న కార్మికులు

- రెండో రోజుకు చేరిన పారిశుద్ధ్య కార్మికుల సమ్మె
- వంటావార్పుతో నిరసన

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : మండల కేంద్రమైన రేణిగుంటలో పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఆందోళన రెండో రోజుకు చేరుకుంది. ఒక్కరోజు ఆందోళనతోనే పంచాయతీలో ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. కార్మికుల సమస్యల పరిష్కారంలో జిల్లా పంచాయతీ అధికారులు చొరవ చూపకపోతే రేణిగుంట చెత్తకుంటగా మారే ప్రమాదం కలగనుంది. రేణిగుంట పంచాయతీ కార్మికులు దీర్ఘకాల సమస్యల పరిష్కారం కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె గురువారం రెండో రోజుకు చేరుకుంది. పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఒక వైపు ఆందోళన చేస్తూ మరో వైపు వంటావార్పు కార్యక్రమం ద్వారా కార్మికుల నిరసన తెలియజేశారు. ఒక్కరోజు ఆందోళనతోనే రేణిగుంట పట్టణంలో గాంధీ బొమ్మ కూడలి, కూరగాయల మార్కెట్, మంచినీళ్లగుంట పార్కు, అంబేడ్కర్ విగ్రహం కూడలి ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయింది. ఇదే విధంగా పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన కొనసాగితే రేణిగుంటలో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈవోపీఆర్‌డీ ప్రభురావు,ఈవో మణి కార్మికుల నాయకులతో జరిపిన చర్చల్లో కార్మికుల సమస్యలు కొన్నింటిని పరిష్కరించేందుకు అధికారులు అంగీకరించారు. కానీ కనీస వేతనం 18 వేల రూపాయలు ఇచ్చేటట్లు ఆదేశాలు వచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని కార్మికులు హెచ్చరించారు.



మంచినీళ్ల గుంట వద్ద పేరుకుపోయిన చెత్త



పంచాయతీ కార్యాలయం సమీపంలో చెత్త ఇలా..

గ్లాసులు లేవా శివయ్య!



శ్రీకాళహస్తీశ్వరాలయంలోని ఈఓ కార్యాలయానికి ముందే ఉన్న తాగునీటి కొళాయిల వద్ద గ్లాసులు లేక గురువారం భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో తాగునీటి కోసం సుపథం మండపం సమీపంలోని తాగునీటి కొళాయి వద్ద బారులు తీరారు. గ్లాసులు ఏర్పాటు చేయకపోవడంతో కొళాయికి చేతులు పెట్టి తాగాల్సి వస్తోంది. ఆలయ అధికారులు ఆ వైపే తిరుగుతున్నా భక్తుల కష్టాలు కనపడకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. శ్రీకాళహస్తి

తప్పిన పెను ప్రమాదం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట– శ్రీకాళహస్తి రహదారి చెక్‌పోస్ట్ సమీపంలోని రైల్వే వంతెన వద్ద ఏర్పాటు చేసిన ఇనుప ఆర్చిని బుధవారం అర్ధరాత్రి శ్రీకాళహస్తి నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కెఏ 34 సి 65 94 నెంబర్ గల లారీ ఢీకొట్టింది. దీంతో అది నడి రోడ్డుపై అడ్డంగా పడిపోయింది. ఆ సమయంలో అటువైపు ఎవరూ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఉదయం నుంచి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం రైల్వే అధికారులు ఆ ఇనుప రాడ్‌ను తొలగించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



రేణిగుంట రైల్వే వంతెన వద్ద పడిన ఇనుప ఆర్చి వల్ల ఏర్పడిన ట్రాఫిక్ అంతరాయం

రహ'దారుణాలు'

- గుంతలమయంగా ఆలత్తూరు రహదారి
- అధిక లోడ్‌తో వెళుతున్న వాహనాలతో గుంతలు
- పట్టించుకోని మైనింగ్ అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ : సంక్రాంతిలోపు రహదారులను తళతళా మెరిసేలా చేస్తామని.. గుంతలు లేకుండా పూడ్చుతామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పింది.. ఉగాది పండుగ వచ్చినా రోడ్ల పరిస్థితిలో మార్పు రాలేదు. ఆలత్తూరు రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. రహదారిలో దారిని వెతుక్కొని వాహనదారులు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఆలత్తూరు, పీవీకండ్రిగ, పుత్తేరి, కత్తివారికండ్రిగ, రెడ్డిగుంటబాడవ, పట్టాభిగిరిజన కాలనీ గ్రామాలకు కేటీరోడ్డు నుంచి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేటీ రోడ్డు నుంచి ఈ గ్రామాలకు 18 కిలోమీటర్లు తారు రోడ్డు ఉంది. ఈ రోడ్డును 2016లో ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజనలో వేశారు. ఈ రోడ్డు వెంట క్రషర్లు, క్వారీలు ఉన్నాయి. క్రషర్లు, క్వారీల నుంచి లారీల్లో 50 టన్నులకు పైగా బరువున్న రాళ్లను నింపుకుని తీసుకుపోతున్నారు. దీంతో రోడ్డు దెబ్బతిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

అధిక లోడ్‌తో లారీలు వెళ్తూ..

రోడ్డుపై గుంతల వలన ఆర్టీసీ బస్సుల కట్టలు దెబ్బతింటున్నాయని, బస్సు సర్వీసులను రద్దు చేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఓవర్ లోడ్ మెటల్ లారీలు రోడ్డుపై తిరగకుండా అరికట్టాల్సిన మైనింగ్ అధికారులు మామూళ్లు తీసుకొని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ రహదారిలో రోజుకు 200పైగా పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అధికారులు స్పందించి రహదారిలోని గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పీవీకండ్రిగ గ్రామం వద్ద అధ్వానంగా రోడ్డు



కేటీరోడ్డు కూడలి వద్ద ఆలత్తూరు రోడ్డు ఇలా..